యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



వరి సాగులో సస్యరక్షణ పద్ధతులపై మాట్లాడుతున్న ఏవో భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: వరి సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్య లు, యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి భారతి అన్నా రు. మంగళవారం వెస్టువరత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, చిన్నపాటి మెలకువలు పాటిస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు పెరుగుతాయన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబా టులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దకన్నలిలో సోమవారం రాస్ మహిళా పొదుపు సంఘాల మహిళలు వైభవంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. గ్రామస్తులు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వేదపండితులు మనోహర్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో మంగళవారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ రవి తెలిపారు. చెన్నై–ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు కింద సుమారు 50 ఏళ్ల వ్యక్తి పడి మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

108 అంటే ప్రజలకు భరోసా. ఆపదలో ఉంటే క్షణాల్లో వచ్చి ప్రాణాలు కాపాడే సంజీవని. అయితే ప్రస్తుతం ఆ వాహనాలకు సుస్తీ చేసింది. అదేంటో తెలుసా.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం. అంబులెన్స్‌లకు ఇంధనం లేకపోయినా పట్టించుకోవడం లేదు. అవి ఆగిపోయి ఆస్పత్రికే పరిమితం అయినా వాటి ఊసెత్తడం లేదు. ఫలితంగా ప్రజలకు ప్రాణ రక్షణ, భద్రత కరువైంది. ఆపద వేళ ప్రజలు ఆటోల కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.



ఆపద్బాంధవి..

అలసి..సొలసి!

- అంబులెన్స్‌లకు ఇంధన సమస్య
- సిబ్బందికి వేతన వెతలు
- ఆపద వేళ అందని సేవలు

శ్రీకాళహస్తి: ఆపద వేళ కుయ్..కుయ్.. మంటూ వచ్చి ప్రాణాలు నిలిపే అపర సంజీవని కూత శ్రీకాళహస్తి పట్టణంలో మూగబోయింది. పట్టణంలో 108 వాహనం ఉన్నా అది ఆస్పత్రి వద్దనే ఆగి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు 108 వాహనాలు 4 కేటాయించింది. అయితే ప్రస్తుతం వాటి పరిస్థితి దయనీయంగా మారింది. పలు సమస్యలతో క్షతగాత్రులు, గర్భిణులు, అత్యవసర వేళ ప్రజలకు సక్రమంగా సేవలు అందించడం లేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంధన కష్టాలు

ఆపద్బాంధవిగా పిలిచే 108 వాహనాలకు ఇంధన కష్టాలు వచ్చి పడ్డాయి. పెట్రోల్ బంకుల్లో ఇంధన బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో వాహనాలకు బంకుల యాజమాన్యాలు పెట్రోల్, డీజిల్ పట్టడం లేదు. వాహనాలకు పోసే ఇంధనం బకాయిలు ఉండడంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు 108 వాహనాలకు పెట్రోల్ పోయడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో కుయ్ కుయ్ మంటూ తిరగాల్సిన 108 వాహనాలు కుయ్యో మొర్రో అంటూ ఆస్పత్రి వద్ద పరిమితం అవుతున్నాయి.

సిబ్బందికి వేతన కష్టాలు

అంబులెన్స్‌ల్లో పనిచేసే సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందలేదు. అయితే ఇటీవల మూడు నెలలకు జీతాలకు గానూ రెండు నెలల జీతం మాత్రం ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. మిగిలిన ఒక నెల వేతనంతోపాటు ఈ నెల కూడా సగం రోజులు గడిపోవడంతో వారు తమ కుటుంబ అవసరాలకు ఇక్కట్లు పడుతున్నారు.

మొరాయిస్తున్న వాహనాలు

శ్రీకాళహస్తికి కేటాయించిన వాహనాన్ని చిట్టత్తూరుకు పంపి, అక్కడి వాహనాన్ని శ్రీకాళహస్తికి తెచ్చుకున్నారు. అయితే అది సరిగా పనిచేయకపోవడంతో తిరుపతికే పరిమితం చేశారు. రేణిగుంట, తొట్టంబేడు 108 వాహనాలు తరచూ మొరాయిస్తుండడంతో సిబ్బందితోపాటు అత్యవసర పరిస్థితిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి అంబులెన్స్ సేవలు అందకపోవడంతో అత్యవసర వేళ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

ఆటోలే గతి

శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ఎవరికైనా ఆపద వస్తే ప్రమాదాలు జరిగిన ప్రాంతాలకు సమయానికి చేరుకోవడం లేదు. దీంతో బాధితులకు ఆటోలే శరణ్యమవుతున్నాయి. ఇటీవల జెట్టిపాళెం వద్ద ముగ్గురిపై హత్యాయత్నం జరిగిన ఘటనలో బాధితులు 108 వాహనానికి ఫోన్ చేసినా రాకపోవడంతో రక్తం కార్చుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో ఆస్పత్రికి చేరుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన 108 వాహనాలు మొరాయిస్తుండడంతో కూటమి ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 108 అంబులెన్సుల కొరత

కొన్ని 108 సర్వీసులు పనిచేయడం లేదు. కొంత మంది డయాలసిస్ పేషెంట్లను 108లో తిరుపతికి తరలిస్తుంటే విమర్శిస్తున్నారు. దీనివల్ల అత్యవసర కేసులకు సేవలు అందించడం ఇబ్బంది కలుగుతోంది. జీతాలు లేక ఇబ్బందుల పడుతున్న మాకు ఇంధనం కొరత, జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు.

– మహేష్, జిల్లా 108 అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రభుత్వంలో విలీనం చేయాలి

108 అంబులెన్సు సేవలను ప్రభుత్వంలో విలీనం చేయాలి. సేవలను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డిమాండ్ చేశాం. మా డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ సమ్మె చేస్తాం.

– 108 అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కిరణ్

108 సకాలంలో వస్తే మా తమ్ముడు బతికేవాడేమో..!

మా తమ్ముడు విష్ణువర్ధన్ కుర్రాళ్ల గొడవల్లో 6వ తేదీ కత్తిపోట్లకు గురై 10వ తేదీ చనిపోయాడు. గాయపడిన ప్రాంతం నుంచి ప్రభుత్వాస్పత్రికి 108 రాకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకువచ్చాం. అక్కడి నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి తరలించడానికి కూడా 108 రావడంలో ఆలస్యమైంది. ఈ సమయంలో రక్తస్రావం ఎక్కువైంది. మా తమ్ముడు మరణించడం ఇప్పటికీ షాక్‌గా ఉంది.

– సుబ్బు, నెలవాయి

తెప్పపై ఆండాళ్ అమ్మవారు



తెప్పపై విహరిస్తున్న ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం గోదాదేవికి స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను నిర్వహించి అర్చకులు తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారిని సుందరంగా కొలువుదీర్చారు. మేళతాళాలు, కోలాటాల మధ్య అమ్మవారి ఊరేగింపుగా పద్మసరస్సుకు తీసుకెళ్లారు. అక్కడ విద్యుత్ దీపాలతో అలంకరించిన తెప్పపై అధిష్టించారు. వేద, గాత్ర, నాథ కచేరీల మధ్య తెప్ప సరస్సులో మూడు ప్రదక్షిణలు చేసింది. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం, అనంతరం ఏకాంత సేవను నిర్వహించారు.టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, ఆలయ అధికారులు నాగరాజు, భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున, ఏఈలు గురుప్రసాద్, నంది బాబు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రబీ పంటలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

నారాయణవనం: రబీ సీజన్‌లో సాగు చేసే ఆరుతడి పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి శోభారాణి సూచించారు. మంగళవారం మండలంలోని అరణ్యకండ్రిగ రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. రైతులతో శోభారాణి మాట్లాడుతూ వర్ష సూచన ఉన్నందున వేరుశనగను రైతులు తొందరపడి విత్తరాదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలని సూచించారు. వేరుకుళ్లు, కాండం కుళ్లు, మొవ్వ కుళ్లు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మండలంలో వరినాట్లు వేస్తున్న రైతులు ప్రతి 2 మీటర్ల కొక కాలిబాట వేసుకోవాలని సూచించారు. సాగు చేసిన వేరుశనగ పంటను ప్రభుత్వం మద్దతుధరతో కొనుగోలుకు చర్యలు చేపట్టాలని, డ్రమ్ సీడర్, స్ప్రేయర్లు, టార్పాలిన్ షీట్లు సబ్సిడీపై ఇవ్వాలని రైతులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. చలికాలంలో పాడిరైతులకు యాజమాన్య పద్ధతులను పశువైద్యాధికారి కుమార్ వివరించారు.

ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం



పూజల్లో పాల్గొన్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం మంగళవారం దిగ్విజయంగా ముగిసింది. శ్రీసిటీ శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ సభ్యులు ఈ నెల 6న ఆలయంలో ఈ మహోత్సవాన్ని ప్రారంభించారు. బయ్యపురెడ్డి ఎస్.రామసుబ్బారెడ్డి నేతృత్వంతో 12 మంది బృందం సభ్యులు వారం రోజులపాటు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో కార్యక్రమం చేపట్టారు. 12 స్కందాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠించారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీ ప్రన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భాగవత భక్త సమాజ బృందానికి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భాగవత భక్త సమాజ బృందం సభ్యులను శాలువాలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పీబీఎస్ శాస్త్రి, పెల్లేటి బాలాజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

72 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



శ్రీసిటీ పోలీసులు కొల్లడంతో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సత్యవేడు: మండలంలోని కొల్లడం ఎస్టీ కాలనీలో పోలయ్య ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని శ్రీసిటీ పోలీసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కొల్లడంలో సోమవారం రాత్రి దాడులు చేశారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన రమేష్, బాలరాజు ఇళ్లలో 72 బస్తాల రేషన్ బియ్యం ఉండడంతో గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని, విచారించారు. దీంతో కొల్లడం గ్రామంలో నివసిస్తున్న ముత్యాలయ్య, పోలయ్య, కన్నయ్య, తదితరులు శ్రీసిటీ పరిధిలోని గొల్లపాళెం, చెరివి, చిగురుపాళెం, ఇరుగుళం, మల్లవారిపాళెం ఈస్టు, వెస్టు , వరదయ్యపాళెం మండలంలోని మరి కొన్ని గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ ఇక్కడ నిల్వ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సేకరించిన బియ్యాన్ని సూళ్లూరు పేటకు, తమిళనాడుకు తరలించి విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



చైతన్యపురంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరం

రేణిగుంట: రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చైతన్యపురంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఆవులు, ఎనుములు, దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వాతావరణం మార్పుల మూలాన మూగజీవాలకు వచ్చే వ్యాధులు, వాటి నివారణోపాయాలను గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి స్రవంతి, రాస్ పశు వైద్యాధికారి అనూష, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ , గిరిప్రసాద్, అన్నలగన్, ఇందుమతి, శంకరయ్య, స్వాతి, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత సత్యవేడు గురుకుల బాలుర జట్టు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ కే.రవి, ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసులు

సత్యవేడు: బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీల్లో సత్యవేడు బాలుర గురుకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచి కప్‌ను కైవసం చేసుకొంది. మంగళవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎంఈఓ కే.రవితో కలసి జిల్లాస్థాయి అండర్ 17 విభాగం కబడ్డీ పోటీల్లో విజేతగా నిలచిన 10వ తరగతి విద్యార్థులు ఎన్.శరవణ(కెప్టెన్), ఎస్ పార్థిబన్, కే. రాజశేఖర్, ఎస్‌ఎం శరణ్, ఎస్ కిరణ్, డి. చారుహాసరెడ్డి, టి. పోలయ్య, ఉ. ప్రతీషన్, టి. ఐజాక్, ఎస్ శరవన్, పి. ఉమాపతి క్రీడాకారులను అభినందించారు. అలాగే అండలో–14లో కబడ్డీ వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచిన గురుకుల పాఠశాల 9వ తరగతి క్రీడాకారులు ఏ. అజయ్, డీఎం, ప్రేమ్‌కుమార్, కే. రాజశేఖర్, ఎస్ ఇనియస్, టి. పూర్ణ, బి. జోష్, వి. పునరసు, డి తస్వీన్, జీ. లతీష్‌లను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి. నాగరాజు, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు వేలంపాడు విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

శ్రీకాళహస్తి రూరల్: సత్యవేడులో జరిగిన ఎస్‌జీఎఫ్ రగ్బీ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో వేలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని, ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం మునిరేణుక, ఉపాధ్యాయులు చంద్రయ్య, జనార్దన్ సరిత, సుబ్రహ్మణ్యం, కామేశ్వరి సుధా బాయ్, భ్రమరాంబ అభినందించారు. అండర్–14 విభాగంలో ఎం.విష్ణు, వి.చాముండేశ్వరి, అండర్–17 విభాగంలో కే.సుబ్రహ్మణ్యం, కె దివ్య అర్హత సాధించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఏర్పేడు విద్యార్థి



మోహిత్ కుమార్

రేణిగుంట: రాజమండ్రిలో జరిగిన అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక పోటీల్లో ఏర్పేడు మండల విద్యార్థి సత్తా చాటి ఎంపిక య్యాడు. మునగలపాలెం హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న రాజులకండ్రిగ గ్రామానికి చెందిన జి.మోహిత్ కుమార్ ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని హెడ్మాస్టర్ రత్నకుమార్ చెప్పారు. అతడిని హెచ్ ఎంతోపాటు మడిబాక సర్పంచ్ కడివెల్ల చంగల్ రాజు, మల్లికార్జున్ నాయుడు, టీచర్లు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడలల్లో కూడా రాణించాలని ఆశీర్వదించారు.

టీచర్లను అవమానించిన విద్యాశాఖ

శ్రీకాళహస్తి: ఉపాధ్యాయులను అవార్డుల పేరిట విద్యాశాఖ అవమానించిందని ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షులు బి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన 175 మంది ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు ప్రకటించించి, విజయవాడకు రావాలని ఆహ్వానించిందని, తీరా అక్కడికి వెళ్లాక గుమస్తా తప్పిదం వలన అవార్డు పొరబాటున ప్రకటించామని ఏడుగురు ఉపాధ్యాయులు తిరిగి వెళ్లిపోవాలని చెప్పడం శోచనీయమన్నారు. అవార్డు వచ్చిందని తన కుటుంబ సభ్యులతో ఎంతో సంతోషంగా తిరుపతి జిల్లా నుంచి వెళ్లిన ఒక టీచర్‌కు ఈ చేదు అనుభవం ఎదురైందని పేర్కొన్నారు.

పరశురామేశ్వరుని సేవలో బుల్లితెర నటులు



గుడిమల్లం ఆలయంలో బిగ్‌బాస్ కంటెస్టెంట్లు

రేణిగుంట: ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరుని మంగళవారం రాత్రి బిగ్‌బాస్ ఫేం బుల్లితెర నటులు మెహబూబ్, హారిక, దీప్తి సునయన తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వివాదాస్పదంగా మద్యం దుకాణం



వీకేఆర్‌వైకాలనీ వద్ద మద్యం దుకాణం

వరదయ్యపాళెం: మండలంలోని అపోలో టైర్ల పరిశ్రమ, సమీపంలో ఉన్న మరికొన్ని పరిశ్రమలకు వెళ్లే రోడ్డు మార్గానికి ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కార్మికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు కూడా ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మద్యం దుకాణం నెంబరు–105 వీకేఆర్ వైకాలనీ కూడలిలో సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని ప్రారంభంలో ఏర్పాటు చేశారు. అదే దుకాణాన్ని 2 రోజుల క్రితం అపోలో టైర్ల పరిశ్రమకు వెళ్లే మార్గంలోకి మార్పు చేశారు. దీంతో రోజువారీ ఆ రోడ్డు మార్గం ద్వారా అపోలో, ఇతర పరిశ్రమలకు వందలాది మహిళా కార్మికులు వెళ్తుంటారు. దీంతో మందుబాబుల మూలాన పలు అనర్థాలు జరిగే అవకాశం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభం నుండే ఈ దుకాణం ఏర్పాటుకు సంబంధించి వివాదం నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, పరిశ్రమ వర్గాలు కోరుతున్నారు.

ఆక్రమిత భూమిలో దుకాణం

సంబంధిత మద్యం దుకాణం ఏర్పాటు చేసిన భూమి ప్రభుత్వ శోత్రియ భూములకు సంబంధించినది. ఆ భూమిని ఆక్రమించుకుని నిర్మాణం చేసిన భవనంలో ప్రస్తుతం మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖ సంయుక్తంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చెంబేడు కాలువలో పడి బాలిక మృతి



లహరి మృతదేహం

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం భవిత పాఠశాలలో చదువుతున్న చైతన్యలహరి(6) మానసిక వికలాంగురాలు పాఠశాల వెనుక ఉన్న మురుగుకాలువలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ ఎస్‌ఐ పార్థసారథి కథనం మేరకు.. పట్టణానికి చెందిన కల్పన కుమార్తె లహరి అనే మానసిక వికలాంగురాలు. ఈమె తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం సమీపంలోని భవిత పాఠశాలలో చదువుతోంది. మధ్యాహ్నం భోజనం తరువాత కనిపించకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు చైతన్యలహరి తల్లిదండ్రులు మధు, కల్పనకు ఫోన్ చేసి తెలిపారు. తల్లి కల్పన పాఠశాలకు చేరుకుని పాప కనిపించకపోవడంతో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల పరిసరాల్లో గాలించారు. కాలువలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పాపను ఆటోలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చైతన్యలహరిని పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు.

ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

- దర్జాగా శ్మశానం రోడ్డు, పంట కాలువ ఆక్రమణ
- నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు



శ్మశానం రోడ్డుకు కంచె వేసిన దృశ్యం, ఆక్రమణకు గురైన పంటకాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీయస్ పురం గ్రామ పంచాయతీ వేణుగోపాలపురంలోని శ్మశానికి వెళ్లే రోడ్డు, పంటలకు నీరందించే పంట కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ మండల యూత్ నాయకుడు కిరణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణలకు పాల్పడి ఇనుప కంచెను వేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎవరైనా మరణిస్తే రోడ్డు ఆక్రమణ మూలాన శ్మశానానికి మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారని, పంటకాలువను పూడ్చి ఆక్రమించడంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇకనైనాఅధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి



బుజ్జికి నివాళులర్పించిన నూకతోటి రాజేష్

నాగలాపురం: స్థానిక బజారు వీధిలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త బుజ్జి(బుక్‌స్టోర్) మూడు రోజులుగా అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నాగలాపురంలోని బుజ్జి స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు చిన్నదొరై, శ్యామ్, దేశప్పన్, జగదీష్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో ఎంజీఎం విద్యార్థి ప్రతిభ



ఉమర్ అక్మల్‌ను అభినందిస్తున్న ఐశ్వర్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం పాఠశాల విద్యార్థి ఎస్‌కే ఉమర్ అక్మల్ అండర్–14 విభాగంలో ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచాడు. మంగళవారం ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ గుద్దూరు ఐశ్వర్య ఆ విద్యార్థిని అభినందించారు. తమ స్కూల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఐశ్వర్య చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి తహలీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేణిగుంట: రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని 35ఏళ్ల వ్యక్తి మరణించాడు. అతడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వలస కూలీగా భావిస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.